
# సాక్షి ఒడిశా

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలక వర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,39,508లు, బంగారం 5 గ్రాముల 550 మిల్లీ గ్రాములు, వెండి 32 గ్రాముల 450 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**యూసీసీని వ్యతిరేకిస్తూ నిరసనలు** - 8లో



**ఉన్నత విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం** - 8లో

## న్యూస్‌రీల్

### విజిలెన్స్ వలలో పోలీసు అధికారి



విజిలెన్స్ టీమ్‌కు చిక్కిన పోలీసు అధికారి మహంతి

జయపురం: స్థానిక సదర్ పోలీసుస్టేషన్ పరిధి అంబాగుడ పోలీసు పంటి సబ్ ఇన్‌స్పెక్టర్ రూ.5 వేల లంచం తీసుకుంటూ విజిలెన్స్ వలలో చిక్కారు. వివరాల్లోకి వెళ్తే.. సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత కుమార్ మహంతి జయపురం సదర్ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఒక కేసులో ఒక వ్యక్తికి సహకరించేందుకు రూ.5 వేల లంచం డిమాండ్ చేశారు. ఈ విషయంపై బాధిత వ్యక్తి విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేయగా, ఒడిశా విజిలెన్స్ టీమ్ ఎస్ఐ లంచం తీసుకుంటూ ఉండగా పట్టుకున్నారు. అలాగే అనంతరం ఎస్ఐ ప్రభుత్వ నివాసంపై, ధమంజ ోడిలోని అతడి అద్దె ఇంటిపై, కార్యాలయంలో దాడులు నిర్వహించారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

### విద్యుత్ మీటర్ రీడర్ హత్య



హత్యకు గురైన లక్ష్మీ నారాయణ త్రిపాఠి మృతదేహం



లక్ష్మీ నారాయణ త్రిపాఠి (ఫైల్)

బరంపురం: గంజాం జిల్లాలోని గెలరి గ్రామంలో విద్యుత్ మీటర్ రీడర్ హత్యకు గురైన ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఎస్పీ జగ్మోహన్ మీనా తెలిపిన వివరాల మేరకు.. గెలరీ పోలీసుస్టేషన్ పరిధి కుడాలి ఆదివాసీ గ్రామంలో విద్యుత్ మీటర్ రీడింగ్ కోసం వెళ్లిన సౌత్ కో ఉద్యోగి లక్ష్మీ నారాయణ త్రిపాఠి హత్యకి గురైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని బంజనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



రవిబాబును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: విశాఖపట్నం–గుణుపురం ట్రెన్‌లో సోమవారం ప్రయాణిస్తున్న బర్నాల రవిబాబు(50) కాశీనగర్ స్టేషన్ వద్ద దిగుతుండగా కాలుజారి పడడంతో, దురదృష్టవశాత్తు ఆయన రెండు పాదాలు తెగిపోయాయి. వెంటనే క్షతగాత్రుడుని పర్లాకిమిడి కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం డాక్టర్లు పరీక్షించి గాయం తీవ్రంగా ఉండడంతో బరంపురం ఆస్పత్రికి తరలించారు. కాశీనగర్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

### గంజాయి స్వాధీనం

- ముగ్గురు అరెస్టు

రాయగడ: జిల్లాలోని రామనగుడ పోలీసులు ఆదివారం నిర్వహించిన దాడుల్లో 73 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు గజపతి జిల్లా ఒడవా ప్రాంతానికి చెందిన రమాకాంత్ నాయక్ (36), ప్రదీప్ చంద్ర నాయక్(37), మున్నా బెహర (23)లుగా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. రామనగుడ ఎస్ఐ పృథ్వీరాజ్ జంకార్ నేతృత్వంలో రామనగుడ పోలీసుస్టేషన్ పరిధిలోని చకుండా కూడలిలో ఆదివారం ఉదయం వాహన తనికీలను నిర్వహించారు. ఈ క్రమంలో గజపతి జిల్లా ఒడవా నుంచి ఒక వాహనంలో అక్రమంగా గంజాయిని రవాణా చేస్తుండగా గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను కోర్టుకు తరలించారు.

### సప్లిమెంటరీలో 33 శాతం ఉత్తీర్ణత

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) ఆధ్వర్యంలో జరిగిన హైస్కూల్ సర్టిఫికెట్ (హెచ్ఎస్‌సీ) 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను సోమవారం ప్రకటించారు. ఫలితాలు బోర్డు అధికారిక వెబ్‌సైట్ www. bseodisha.ac.in అందుబాటులో ఉన్నాయి. ఈ పరీక్షలకు హాజరైన 1,310 మంది విద్యార్థుల్లో 433 మంది ఉత్తీర్ణులయ్యారు. 360 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. అలాగే స్టేట్ ఓపెన్ స్కూల్ పరీక్షలు రాసిన 8,920 మంది విద్యార్థుల్లో 6,778 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 525 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరు కాగా, 49 మంది మాల్ ప్రాక్టీస్ కింద బుక్ అయినట్లు బీఎస్ఈ తెలిపింది.

# బాక్సైట్ తవ్వకాలకు ఓకే..!

- మద్దతు తెలిపిన పరిసర ప్రాంతాల ప్రజలు



సుంగేరులో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం



మైత్రీ కంపెనీ అధినేత శ్రీనివాస్‌రావుకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి కుటురుమాలి, సిజారిమాలి ప్రాంతాల్లోని ఖనిజ నిక్షేపాలు (బాక్సైట్) తవ్వకాలకు సంబంధించి ఎట్టకేలకు ఆయా ప్రాంతాల ప్రజలు మద్దతు తెలిపారు. తవ్వకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వేదాంత కంపెనీకి అనుమతి ఇవ్వడంతో అందుకు సంబంధించి సుంగేరు, సగొబరి, బంతీజ్, సింధూరఘాటి పంచాయతీల్లోని ప్రజల అభిప్రాయాన్ని సేకరించేందుకు కొద్ది రోజులుగా మైత్రీ ఇన్‌ఫ్రాస్టక్చర్ కంపెనీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. మైత్రీ కంపెనీ అధినేత శ్రీనివాస్ రావు, సీఈవో ఎన్.సత్యనారాయణలు సుంగేరు గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మొదట్లో గ్రామస్తులు బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకించడంతో కంపెనీకి చుక్కెదురయ్యింది. అయితే మైత్రీ అధినేత శ్రీనివాసరావు చొరవ తీసుకుని ప్రజలకు కంపెనీ ఏర్పాటు వల్ల జరిగే అభివృద్ధి వివరంగా తెలియజేయడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరుసగా మూడు రోజుల పాటుగా గ్రామాల్లో పర్యటించి అపోహలు వీడి అభివృద్ధి వైపు నడవాలని అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో సుంగేరు గ్రామంలో పంచాయతీ సర్పంచ్ ప్రమీలా మాఝి ఆధ్వర్యంలో ప్రజా వేదికను ఆదివారం నిర్వహించారు. బాక్సైట్ తవ్వకాలకు అనుమతిస్తే భారీ పరిశ్రమలు ఏర్పాటు కావడంతో పాటు ప్రజల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధితో జీవన స్థితిగతులు పూర్తిగా మారిపోతాయని వివరించడంతో ఎట్టకేలకు సమస్య ఒక కొలిక్కి వచ్చింది.

**పరిశ్రమలతో ప్రగతి**

భారీ పరిశ్రమలు ఏర్పాటైతే తమ ప్రాంతం అన్నివిధాలుగా అభివృద్ధి చెందడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సర్పంచ్ ప్రమీల మాఝి పేర్కొన్నారు. అందువల్ల పరిశ్రమల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని కోరారు. కొంతమంది స్వార్థపరులు తమ స్వలాభానికి ప్రగతిని అడ్డుకుంటున్నారని, అటువంటి వారి మాయమాటల్లో పడకూడదని విన్నవించారు. అలాగే ఈ ప్రాంతంలో సమస్యలు పరిష్కరిస్తామని మైత్రీ కంపెనీ సీఈవో ఎన్.సత్యనారాయణ తెలియజేశారు. దీంతో సగొబరి, బంతీజ్, ఒడొజారొ, సింధూరుఘాటి పంచాయతీల్లోని దాదాపు నలభై గ్రామాలకు చెందిన ప్రజలు సమావేశంలో పాల్గొని మద్దతు తెలిపారు.

## • జల హొయలు



పర్లాకిమిడికి దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగాబడ పంచాయతీ గండాహతి జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. ప్రస్తుతం వర్షాలు కాస్త తక్కువగా ఉండడం వలన ఇక్కడ ఉల్లాసవంతంగా గడిపేందుకు అధిక సంఖ్యలో ప్రజలు విచ్చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా సందడిగా మారింది. – పర్లాకిమిడి

# భారీ మావో డంప్ స్వాధీనం



డంప్‌లోని మావో సామగ్రితో జవాన్‌లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బేజాంగ్‌వాడ పంచాయతీ సమీపంలో సోమవారం సాయంత్రం బీఎస్ఎఫ్ జవాన్లు మావోలు అమర్చిన భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బేజాంగ్‌వాడ వద్దనున్న 142 బెటాలియన్ బీఎస్ఎఫ్ జవాన్లుకు ముందస్తు సమాచారం రావడంతో, సోమవారం ఉదయం అమాపోదర్, ఎక్కనూర్, బోడాల్‌గూడ, బృంద మామిడి గ్రామాల సమీపంలోని అడవుల్లో కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టులు అమర్చిన డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. డంప్‌లో జిలిటిన్ స్టిక్స్ 29, 30 ఎలక్ట్రికల్ డిటర్నేటర్స్, సింథటిక్ వెయిస్ట్ బెల్ట్‌లు 9, 303 రైఫిల్ 1, బారిల్ (ఎస్‌బీఎంఎల్) 11, 5 కిలోల హ్యాండ్ గ్రనైట్ 1, దేశీయ తుపాకీలు 3, గ్యాస్ వెల్డింగ్ మిషన్ రెగ్యూలేటర్ సెట్ 1, వైర్లు, బుల్లెట్లు ఉన్నాయి.



స్వాధీనం చేసుకున్న డంప్‌లో ఉన్న సామగ్రి

# రక్తదానంతో ప్రాణదానం

- మంత్రి ప్రదీప్ అమాత్



రక్తదానం చేస్తున్న కళ్లికోట్ ప్రజలు



రక్తదానం చేసినవారికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

బరంపురం: రక్తదానం చేస్తే ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లేనని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ప్రదీప్ అమాత్ అన్నారు. స్థానిక కళ్లికోట్ మర్దరాజ్ కల్యాణ మండపం ప్రాంగణంలో కళ్లికోట్ రాణి సాహిబా సూజ్ఞాని దేవి పుట్టినరోజు సందర్భంగా ఒడిశా జీవన బిందు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సమయానికి రక్తం లభించకపోవడంతో ప్రమాదాల సమయంలో ఎంతోమంది ప్రాణాలు విడుస్తున్నారని పేర్కొన్నారు. అందువలన రక్తదాన శిబిరాలు విరివిగా నిర్వహించాలని సూచించారు. శిబిరంలో సుమారు 296 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో కవిసూర్యనగర్ ఎమ్మెల్యే లతికా ప్రధాన్, పులసరా ఎమ్మెల్యే శ్రీకాంత్ సాహు, బ్లాక్ అధ్యక్షుడు దైతరి బెహరా, బీడీఏ చైర్మన్ సుభాష్ మహరణ తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు కిడ్నాపర్లు అరెస్టు



నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలో +3 చదువుతున్న విద్యార్థి కిడ్నాప్‌కు సంబంధించి ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సార్వణ్ వివేక్ సోమవారం తెలిపిన వివరాల మేరకు.. నిమ్మఖండి పోలీసుస్టేషన్ పరిధిలోని గోవింద విహార్ 7వ లైన్‌లో నివాసముంటున్న బిజయ్ సామల్ కుమారుడు శ్యామ్‌బాబు, ఈనెల 2వ తేదీన కళ్లికోట్ కళాశాలకు వెళ్తున్న సమయంలో దుండగులు కిడ్నాప్ చేశారు. అనంతరం తల్లిదండ్రులకు దుండగులు ఫోన్‌చేసి రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్పీ ఆదేశాలతో నిమ్మకండి పోలీసు అధికారులు ప్రత్యేక బృందంగా ఏర్పడి శాంతినగర్‌లో దర్యాప్తు నిర్వహించారు. ఒక అద్దె ఇంటిపై దాడిచేసి ఆరుగురు కిడ్నాపర్లు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గంజాం జిల్లాకి చెందిన దీపక్ కుమార్ స్వాంయి, నిమ్మన భగత్, సర్వాన్ కార్, బిస్వేష్ బిసాయి, రాధ మాదర్, బౌంసిదర్ పాణిగ్రాహిలు ఉన్నట్లు నిర్ధారించారు. అరెస్టు చేసిన వారిని బరంపురం జిల్లా కోర్టులో హాజరు పరిచి, సర్కిల్ జైలుకి తరలించినట్లు ఐఐసీ అధికారి ప్రశాంత్ భూపతి తెలియజేశారు.

# బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

- మరో వ్యక్తి, ఆవుకు తీవ్ర గాయాలు



శ్రీరామ్ హరిజన్ మృతదేహం

జయపురం: బస్సు ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందడంతో పాటు మరో వ్యక్తి, ఆవు తీవ్రంగా గాయపడినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర్ తండి సోమవారం తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీరామ్ హరిజన్, డొంబు హరిజన్‌లు ఒక వ్యక్తి వద్ద పనిచేస్తున్నారు. ఈనెల 5వ తేదీన బొయిపరిగుడ సమితి బాలిగాం వారాంతపు సంతకు వెళ్లి ఒక ఆవును కొన్నారు. ఆ ఆవుని జయపురం సమితి కేవిడి గ్రామానికి తీసుకెళ్లి ఒక వ్యక్తికి అప్పగించాలని యజమాని ఆదేశించారు. దీంతో ఆదివారం సాయంత్రం వారు ఆవుని తోలుకుంటూ బయల్దేరారు. రాత్రి సమయంలో 26వ నంబర్ జాతీయ రహదారిలో వస్తుండగా ఆ సమయంలో మూడు బస్సులు వరుసగా జయపురం నుంచి బొరిగుమ్మ వైపు వెళ్తున్నాయి. అందులో ఒక బస్సు ఆవుతో పాటు శ్రీరామ్, డొంబులను ఢీకొని దూసుకుపోయింది. బస్సు ఢీకొనడంతో ఆవుతో పాటు ఇద్దరూ దూరంగా ఎగిరిపడ్డారు. ప్రమాదంలో శ్రీరామ హరిజన్ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. డొంబు హరిజన్, ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన భరిణిపుట్ పోలీసు పంటి అధికారి గణేష్ ప్రసాద్ బెహర పోలీసు సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అలాగే గాయపడిన డొంబు హరిజన్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. మున్సిపాలిటీ ఉద్యోగుల సహకారంతో గాయపడిన ఆవును సైతం చికిత్సకు పంపారు. ప్రమాదంలో మరణించిన శ్రీరామ్ హరిజన్ బంధువులు ఆస్పత్రికి చేరుకొని, అనంతరం అతడి కుమారుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఢీకొన్న బస్సును పట్టుకోవాలని, అలాగే వారి కుటుంబాలకు పరిహారం అందించాలని బంధువులు డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన బస్సును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నామని ఈశ్వర తండి వెల్లడించారు.

# గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



పర్లాకిమిడి: వినతులు పరిశీలిస్తున్న అధికారులు



పర్లాకిమిడి: వినతులు అందించేందుకు విచ్చేసిన ప్రజలు



జయపురం: గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు పరిశీలిస్తున్న అధికారులు



రాయగడ: సమస్యలు వింటున్న కలెక్టర్ సింగ్

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ అధ్యక్షతన వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం జరిగింది. దీనిలో భాగంగా మొత్తం 66 వినతులు వచ్చినట్లు అధికారులు తెలియజేశారు. దీనిలో 52 వ్యక్తిగత సమస్యలు కాగా, 14 గ్రామ సమస్యలుగా గుర్తించారు. ఆరుగురుకి సీఎం సహాయ నిధి నుంచి రూ.85 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే మరొకరికి రెడ్‌క్రాస్ నుంచి రూ.10 వేల సాయం అందజేశారు. హటొశశిఖాల్ పంచాయతీలోని లుంబేసు, కెరిండి, జాజామణి, హటొశశిఖాల్ గ్రామాలకు చెందిన 350 మంది తమకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే పట్టణంలోని రైతుల కాలనీలో పారిశుద్ధ్యం పరమ అధ్వానంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు విన్నవించారు. అదేవిధంగా రైతుల కాలనీ నాలుగో లైన్‌లో సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల తాము ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

**జయపురంలో...**

జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయ సభా గృహంలో జరిగిన గ్రీవెన్స్‌లో 60 వినతులు వచ్చినట్లు అధికారులు తెలియజేశారు. జయపురం సబ్ కలెక్టర్ బేదబర ప్రధాన్, ఐపీఎస్ అధికారి సౌమ్యరంజన్ ప్రధాన్, జయపురం మున్సిపల్ చైర్‌పర్సన్ నరేంద్ర కుమార్ మహంతి, జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణ పాఢీ, మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి తదితరులు పాల్గొన్నారు. ఫిర్యాదులను పరిశీలించిన అధికారులు సంబంధిత విభాగ అధికారులతో చర్చించి వెంటనే చర్యలే తీసుకోవాలని ఆదేశించారు.

**పర్లాకిమిడిలో...**

గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడి కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ స్మృతి రంజన్‌ప్రధాన్, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డిప్యూటీ కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్‌ల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. రాణిపేట, కెరండి, బాగుసల సిద్ధమణుగు పంచాయతీల నుంచి ప్రజలు విచ్చేసి సమస్యలపై వినతులు అందజేశారు. మొత్తంగా స్పందన కార్యక్రమానికి 115 వినతులు రాగా, అందులో వ్యక్తిగత సమస్యలు 88, గ్రామ సమస్యలు 27 వినతులు అందాయి. ఐదుగురికి రూ.13 వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య చికిత్సాధికారి డా.ప్రదీప్ కుమార్‌పాత్రో, గ్రీవెన్స్ నోడల్ అధికారి నర్మదా దొళాయి తదితరులు పాల్గొన్నారు.



రాయగడ: ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని విన్నవించేందుకు వచ్చిన ప్రజలు

## క్లుప్తంగా

### బాధ్యతల స్వీకరణ

రాయగడ: జిల్లా అదనపు కలెక్టర్‌గా రామేశ్వర్ ప్రధాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వహించిన సోమనాథ్ ప్రధాన్ బదిలీ అవ్వడంతో ఆయన స్థానంలో ప్రధాన్ నియమితులయ్యారు. కొరాపుట్‌లో ఏడీఎంగా ఇదివరకు రామేశ్వర్ విధులు నిర్వహిస్తుండేవారు. ఆయనకు సిబ్బంది, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు.

### యోగా శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బొబ్బిలి: యోగా కోర్సుల్లో పీజీ, పీజీ డిప్లమో, పీహెచ్‌డీ కోర్సులకు ఆంధ్రా యూనివర్సిటీ ఆహ్వానం పలుకుతోందని పట్టణంలోని శ్రీయోగ విద్యాసంస్థ కోర్సు డైరెక్టర్లు ఎంఈవీ ప్రసాద్, కె.సత్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మా శ్రీ యోగా సంస్థలో ఆరు నెలల డిప్లొమో కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు ఎంఓయూ కుదిరించదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆంధ్రాయూనివర్సిటీ అనుమతించిన ఏకైక యోగా విద్యా సంస్థ తమదేనన్నారు.ఆరు నెలల యోగా కోర్సు కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 డీడీ తీసి చేరాలని సూచించారు. రూ.10వేల కోర్సు ఫీజుతో ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాల్సి ఉందన్నారు. మా సంస్థకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని విజయనగరం ప్యాలస్ ద్వారా కోర్సుకు అప్లై చేసుకోవాలని, లేదా ఫోన్ 9988229011, 7013969066 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### 7తులాల బంగారం చోరీ

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో 7తులాల బంగారు అభరణాలు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన గురునాయుడు తన కుమార్తె వివాహం నిమిత్తం బంగారం హారం, తాడు, తదితర వస్తువులు కొని ఇంట్లో బీరువాలో భద్రపరిచాడు. ఆదివారం రాతిర ఉక్కపోత వల్ల కుటుంబసభ్యులు మేడపైన ఇంట్లో పడుకున్నారు. సోమవారం ఉదయం గురునాయుడు కుటుంబసభ్యులు కిందికి దిగి చూడగా ఇంటికి ఉన్న తాళం పగులగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. దీంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువా తాళం పగులగొట్టి తలుపులు తెరిచి ఉండడంతో బంగారం చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు క్లూస్ టీం బృందం వచ్చి వేలిముద్రలు సేకరించింది. ఘటన స్థలానికి వచ్చిన సీసీఎస్ ఎస్సై బుచ్చిరాజు, ఎస్.కోట సీఐ బాల సూర్యారావు జరిగిన ఘటనపై ఆరా బాధితులను అడిగి తెలుసుకున్నారు.

### వసంత్ విల్లాలో చోరీ

విజయనగరం క్రైమ్: స్థానిక ధర్మపురి వసంత విహార్ విల్లాలో ఆదివారం చోరీ జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వసంతవిహార్ విల్లా 49లో నివాసం ఉంటున్న వర్రి శ్రీనివాసరావు గంట్యాడ మండలం డీకే పర్తిలో సచివాలయ సంక్షేమం, విద్యాసహాయకుడిగా పనిచేస్తున్నాడు. ఆరోతేదీన ఆయన అత్తవారింటికి డెంకాడ వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం విరగ్గొట్టి, తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. బెడ్ రూం బీరువా, కప్ బోర్డు తెరిచి వస్తువులన్నీ చిందరవందరగా ఉండడంతో బీరువాలో ఉన్న ఆరుతులాల బంగారు ఆభరణాలు, కిలో వెండి వస్తువులు, కొంతనగదు పోయినట్లు గుర్తించారు. సమాచారం మేరకు రూరల్ సీఐ తిరుపతిరావు, ఎస్సై గణేష్‌లు సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గణేష్ తెలిపారు.

### పల్సర్ బైక్ రమణ సినిమా షూటింగ్ సందడి

విజయనగరం టౌన్: పల్సర్ బైక్ రమణ సినిమా షూటింగ్ సందడి జిల్లా కేంద్రంలో సోమవారం నెలకొంది. రమణ నటిస్తున్న ఈ చిత్రానికి బేబీ 2.0 టైటిల్ ఖరారు చేశామని దర్శకుడు కుమారస్వామి తెలిపారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా ఇప్పుడున్న యూత్‌కు చిత్రం కనెక్ట్ అవుతుందని చిత్రయూనిట్ పేర్కొంది. హీరో యిన్ సోనీరెడ్డి, ప్రతినాయకుడిగా ప్రశాంత్ చిత్రంలో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా హరీష్ కోరాడ, ఎడిటర్ ప్రసాద్, పాటలు, సంగీత దర్శకుడి జాన్ వ్యవహరిస్తున్నారు. షూటింగ్‌ను వీక్షించేందుకు స్థానికులు, ఔత్సాహికులు తరలివచ్చారు.

### సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) విజయనగరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి పార్లు దండాలతో నిరసన వ్యక్తం చేశారు. దీంతో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్రావు, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్మోహన్‌రావు, సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు మున్సిపల్ యూనియన్ నాయకులు టి.బాబురావు, ఎం దుర్గారావు, జలగడుగుల బాలరాజు, జలగడుగుల గణపతి, జలగడుగుల సీతారాం లను పోలీసులు అరెస్టు చేసి ఒకటవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడిచిపెట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

## యూసీసీని వ్యతిరేకిస్తూ నిరసనలు



రాయగడ: కపిలాస్ కూడలిలో ఆందోళనలు చేస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: బంద్‌లో పాల్గొన్న గిరిజన సంఘాల నేతలు



మల్కన్‌గిరి: స్వచ్ఛందంగా మూసివేసిన బజార్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ))ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని పలుచోట్ల నిరసనలు తెలిపారు. దీంతో వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి. యూసీసీ వలన గిరిజన, ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతికి తీవ్రనష్టం వాటిల్లుతుందని ఆందోళనకారులు నినాదాలు చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. – సాక్షి నెట్‌వర్క్

# దేశభక్తి ఉప్పొంగేలా జెండా పండగ

- ఆజాది కా అమృత్ మహోత్సవ్ స్ఫూర్తిని ప్రజల్లో నింపాలి
- ప్రగతిని ప్రజలకు వివరించేలా నగర కూడళ్లలో శకటాల ప్రదర్శన
- ఏర్పాట్లపై సమీక్షించిన ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్‌అశోక్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్‌అశోక్

విజయనగరం అర్బన్: ఆజాది కా అమృత్ మహోత్సవ్ స్ఫూర్తిని నింపేలా, ప్రతి ఒక్కరిలో దేశభక్తి ఉప్పొంగేలా 77వ స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. గతం కంటే మిన్నగా.. మరింత గొప్పగా వేడుకలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ శాఖల పనితీరును, ప్రగతిని ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రజల సమక్షంలో శకటాల ప్రదర్శన నిర్వహించాలని సూచించారు. స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లు, ఇతర అంశాలపై ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సమీక్షించారు. ప్రభుత్వ పనితీరు, ప్రగతి గురించి ప్రజలకు తెలిపేందుకు శకటాల ప్రదర్శన ఉత్తమ మార్గమన్నారు. కొత్త అంశాలను తీసుకొని శకటాలను ప్రదర్శించాలని ఆదేశించారు. స్టాళ్ల ఏర్పాట్లలో నూతనత్వం కనిపించాలన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో ప్రాథమిక ప్రదర్శన అయిన వెంటనే శకటాలను విజయనగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా తీసుకెళ్లి ప్రజలకు అత్యంత చేరువగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. ఒక రోజు ముందుగానే కలెక్టరేట్ భవనాలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు.

**రేపటి నుంచి నా భూమి-నా దేశం**

ప్రజల్లో దేశభక్తిని నింపేందుకు, మరింత ఉత్తేజపరిచేందుకు ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ఈ నెల 9 నుంచి 15వ తేదీవరకు 'నా భూమి-నా దేశం' కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన వీరులు, త్యాగధనులను స్మరించుకునేందుకు మన జిల్లాలో గ్రామగ్రామాన, పట్టణాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో 'నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్‌సరోవర్ కింద అభివృద్ధి చేసిన చెరువుల వద్ద స్వాతంత్ర్యోద్యమ నాయకుల పేర్లుతో కూడిన శిలాఫలకాలు ఏర్పాటుచేయాలన్నారు. వీరులకు వందనం పేరుతో సమరయోధులు, వీర సైనికులు, అమర వీరుల కుటుంబాలకు చెందిన వ్యక్తులను సత్కరించాలన్నారు. ప్రతి పంచాయతీలో మొక్కల నాటాలన్నారు. సమావేశంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ రాజ్‌కుమార్, డీఈఓ లింగేశ్వరరెడ్డి, సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, మజ్జి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

# ఉన్నత విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం



ప్రియాంకకు చెక్ అందజేస్తున్న కలెక్టర్ ప్రధాన్

పర్లాకిమిడి: జిల్లాలో మోహనా నియోజకవర్గంలోని రాజ్‌పూర్‌లో నల్లాఘాట్ గ్రామానికి చెందిన ఆదివాసీ విద్యార్థినీ ప్రియాంక మఝికి, ముఖ్యమంత్రి మేధావి ప్రోత్సాహక పథకం ద్వారా మంజూరైన రూ.50 వేలను కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తన ఛాంబర్‌లో సోమవారం అందజేశారు. ప్రియాంక ప్రస్తుతం భువనేశ్వర్ లో నవజ్యోతి విజ్ఞాన కేంద్రంలో ప్లస్ టూ సైన్స్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె తండ్రి సోమనాథ మఝి అతిపేద రైతు. దీంతో ప్రియాంక తన ఉన్నత చదువుకు కలెక్టర్‌ను సంప్రదించడంతో ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. కార్యక్రమంలో ఎస్పీ స్వాతికుమార్, డిప్యూటీ కలెక్టర్ బీరేంద్ర కుమార్‌దాస్, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి మమతారాణి పరిడా తదితరులు పాల్గొన్నారు.

# 100లీటర్ల సారా పట్టివేత

వీరఘట్టం: సారా అమ్మకాలు, రవాణాపై పోలీసులు సోమవారం మండల వ్యాప్తంగా సోదాలు చేశారు. ఈ క్రమంలో చిదిమి గ్రామ సమీపంలోని మామిడి తోటలో ఉంచిన సారాను గుర్తించి నిందితుడు శ్రావణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎంవీ రమణ తెలిపారు. ఈ సోదాల్లో 100లీటర్ల సారాతోపాటు స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, స్కూటీ

**సాలూరులో 200 సారా ప్యాకెట్లు..**

సాలూరు: పట్టణంలో ద్విచక్రవాహనంపై తరలిస్తున్న 200 సారా ప్యాకెట్లు పట్టుకున్నామని ఎస్సై భాస్కరరావు తెలిపారు. బంగారమ్మ కాలనీ వద్ద సారా ప్యాకెట్లు తరలిస్తున్న వంతల సూరిబాబు, బంకా సింహాద్రిలను అదుపులోకి తీసుకుని బైక్ సీజ్ చేసినట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

# 13 కేజీల గంజాయి స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఎల్ అప్పలనాయుడు



పట్టుబడిన గంజాయిని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూకం వేస్తున్న ఎస్సై ఫక్రుద్దీన్

పాచిపెంట: ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తున్న 13 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఫక్రుద్దీన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి చెందిన బత్తిన చందు, తుమ్మ నాగరాజులు ఒడిశాలోని జైపూర్ నుంచి ఆర్టీసీ బస్సులో గంజాయిని సాలూరు వైపు తరలిస్తుండగా పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్నామన్నారు. ఆ నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూకం వేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

**కైలా జంక్షన్ మరో 10కేజీలు..**

గజపతినగరం: మెంటాడ మండలం కైలాం జంక్షన్ వద్ద 10 కేజీల గంజాయి తరలిస్తున్న ఒడిశా వాసిని పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒడిశాలోని కొరాపుట్ జిల్లా బంగి పుట్ గ్రామానికి చెందిన జయరామ్ గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ పాల్గొన్నారు.

**20కిలోల గంజాయి పట్టివేత**

విజయనగరం క్రైమ్: స్థానిక లంకాపట్నం ఎఫ్‌సీ గోడౌన్ సమీపంలో సోము ఆదిబాబు 20 కిలోల గంజాయిని తీసుకువెళ్తుండగా టూటౌన్ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనలో మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారని కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

## బుచ్చి అప్పారావు విగ్రహానికి స్థలం కేటాయింపు

- ఈస్ట్‌కోస్ట్ చీఫ్ ఇంజినీర్ సుగుణాకర్



తాటిపూడి జలాశయం వద్ద స్థల పరిశీలన చేస్తున్న చీఫ్ ఇంజినీర్, సంఘం కొప్పలవెలమ సంఘం నాయకులు

గంట్యాడ: గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం (తాటిపూడి) వద్ద బుచ్చి అప్పారావు విగ్రహానికి స్థలాన్ని కేటాయిస్తామని ఇరిగేషన్ శాఖ ఈస్ట్ కోస్ట్ చీఫ్ ఇంజినీర్ శంబంగి సుగుణాకర్ తెలిపారు. మండలంలోని తాటిపూడి రిజర్వాయర్‌కు స్వర్గీయ బుచ్చి అప్పారావు పేరును నామకరణం చేస్తూ ప్రభుత్వం గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. జలాశయం ప్రాంగణంలో బుచ్చి అప్పారావు విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం తరపున ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో చీఫ్ ఇంజినీర్ సోమవారం రిజర్వాయర్‌ను, సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం విగ్రహ స్థాపన కోసం మూడు చోట్ల కొలతలు తీశారు.

కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మినేని శ్రీనివాస్, రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, జాతీయ కన్వీనర్ కొరుపోలు సత్యారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పారిపిరెడ్డి అప్పలనాయుడు, శీర సత్యనారాయణ, డాక్టర్ బొత్స వరప్రసాద్, బొమ్మినాయిని తిరుపతినాయుడు, గేదెల తిరుపతిరావు, తాటిపూడి సర్పంచ్ ఆదిరెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హత్యకేసులో ముద్దాయికి జీవిత ఖైదు

విజయనగరం క్రైమ్: హత్యకేసులో నేరారోపణ రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.పదివేలు జరిమానా విధిస్తూ విజయనగరం ఫోర్త్ ఏడీజే/ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి షేక్ సికిందర్ బాషా సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఆంధ్ర ఎస్సై సిద్ధార్థ కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు వివరాలపై ఆయన మాట్లాడుతూ ఆంధ్ర పోలీస్‌స్టేషన్ పరిధి మెంటాడ గ్రామానికి చెందిన కొల్లి కొండమ్మ భర్త సత్యనారాయణ, ఇల్లరికం వచ్చారన్నారు. ఇల్లరికం వచ్చిన అల్లుడు, కుమార్తెకు ఆస్తిలో వాటా ఇచ్చేందుకు కొండమ్మ తండ్రి సమ్మతించాడు. అయితే ఆయన తమ్ముళ్లు రాయిపల్లి అచ్చియ్య (ఎ1), సీతన్న (ఎ2), మరదలు గౌరమ్మ (ఎ3)ఆస్తిలో వాటా ఇచ్చేందుకు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆస్తి విషయమై కుటుంబసభ్యుల మధ్య తగాదా ఏర్పడడంతో 2018 జూన్ మూడో తేదీన రాత్రి తన భర్తను బంధువులు హత్యచేసినట్లు జూన్ 4న ఆంధ్ర పోలీస్‌స్టేషన్‌లో కొండమ్మ ఫిర్యాదుచేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నిందితుడు రాయిపల్లి అచ్చియ్య (ఎ1)పై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు వెల్లడించారని ఎస్సై తెలిపారు. ఎ2, ఎ3లపై నేరారోపణలు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా పరిగణించారని చెప్పారు. బాధితురాలి తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీవీఎస్ జయలక్ష్మి వాదనలు వినిపించారు.

# గొంతుకోసి పరారైన అగంతకుడు

పార్వతీపురం: గుర్తు తెలియని వ్యక్తి గొంతుకోసం పరారవడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన పట్నాన నాగరాజు సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తి వచ్చి నాగరాజు ముఖంపై ముసుగువేసి గొంతు కోసి పరారయ్యాడు. ఈఘటనలో నాగరాజు గొంతువద్ద బలమైన గాయం కావడంతో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని సర్పంచ్ జె.ప్రవీణ్‌కుమార్ పోలీసులకు తెలియజేయగా రూరల్ ఎస్సై వై.సింహాచలం కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన నాగరాజు

# ఉపాధ్యాయుడిపై లైంగిక వేధింపుల కేసు

- పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



ఎస్సై లోకేశ్వరరావుతో మాట్లాడుతున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ

వంగర: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిని వేధిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు పాఠశాలలో పనిచేస్తున్న ఎస్ఎస్ ఉపాధ్యాయుడు బండి రాముడుపై వంగర పోలీసులు కేసు నమోదు చేశారు. తమ కుమార్తెతో ఉపాధ్యాయుడు అసభ్యకరంగా మాట్లాడుతూ లైంగికంగా వేధిస్తున్నాడంటూ బాలిక తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర ఆదేశాల మేరకు సంతకవిటి ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు వంగర చేరుకుని విచారణ చేపట్టారు. ప్రత్యేక తరగతుల పేరిట ముందస్తుగా పాఠశాలకు రావాలని చెప్పడం, అందరిలో బాలిక పట్ల వికృత చేష్టలు చేసిన ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్టుచేసిన ఉపాధ్యాయుడు వాట్సాప్‌లో మెసేజ్‌లు చేసేవాడని బాధిత బాలిక తల్లిదండ్రులు విచారణలో తెలియజేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు.

**ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు**

ఎస్.ఎస్.ఉపాధ్యాయుడు బండి రాముడుపై సస్పెన్షన్ విధిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీ చేసినట్లు పాఠశాల హెచ్ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు.

**ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి**

అభంశుభం తెలియని బాలికపై అసభ్యకరంగా వ్యవహరించి, లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ కోరారు. పాఠశాలలో జరిగిన విషయాన్ని తెలుసుకుని హుటాహుటిన ఆయన పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై లోకేశ్వరరావుతో మాట్లాడారు.

## లారీ, బైక్ ఢీ: ఒకరి మృతి



మృతిచెందిన రాములు

పార్వతీపురం: కొమరాడ మండలంలోని కూనేరులో బైక్‌ను లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై సోమవారం పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన దండుపాటి రాములు(55) గ్రామం నుంచి కూనేరుకు చేపలు విక్రయించేందుకు ద్విచక్రవాహనంపై ఆదివారం వెళ్లాడు. చేపల విక్రయం అనంతరం స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా పార్వతీపురంనుంచి రాయగడ వస్తున్న లారీ, కూనేరు-రామభద్రపురం సమీపంలో ఢీకొంది. దీంతో రాములుకు తీవ్రగాయాలు కాగా వెంటనే చికిత్స కోసం పార్వతపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కొమరాడ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి అర్జీని పరిష్కరించాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్



వినతులను స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అందే ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో ఏ విధంగా పరిష్కరిస్తున్నారనే అంశంపై మండల ప్రత్యేకాధికారులు తప్పనిసరిగా సమీక్షించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. వివిధ శాఖలకు అందుతున్న వినతులు, అర్జీదారులు సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించే రీతిలో తగిన చర్యలు తీసుకుంటున్నదీ లేనిదీ పర్యవేక్షించాలని కోరారు. మండలాల్లో అధికారులతో సమావేశాలు నిర్వహించేటప్పుడు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కారంపై ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్ సోమవారం జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సమీక్షించారు. ఇటీవల ఉద్యోగుల వినతుల స్వీకారం కోసం నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగుల నుంచి అందిన వ్యక్తిగత వినతుల పరిష్కారంపై కూడా తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా పలు వర్గాల నుంచి 325 వినతులు అందాయి. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎం.వీ.సూర్యకళ, కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్లు పద్మలత, సుధారాణి, లావణ్య వినతులు స్వీకరించారు.

**ఎస్పీ స్పందనకు 45 ఫిర్యాదులు**

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి 45 ఫిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వారితో మాట్లాడారు. అనంతరం ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశా డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.




ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

## క్లుప్తంగా

### డీఎల్‌టీసీ కేంద్రంలో అప్రెంటిస్ షిప్ మేళా రేపు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** జిల్లా కేంద్రంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రంలో ఈ నెల 9వ తేదీన అప్రెంటిస్ షిప్ మేళా జరగనుందని అసిస్టెంట్ డైరెక్టర్ ఎండ రామ్‌మోహనరావు తెలిపారు. మీడియా సెర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారితో మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేళాకు ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన, ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు కూడా హాజరుకావచ్చన్నారు. ఎలక్ట్రీషియన్ 300, ఫిట్టర్ 300, ఎలక్ట్రానిక్ మెకానిక్ 100, వెల్డర్ 25 ఖాళీలు ఉన్నాయని, వాటి భర్తీ జరుగుతుందన్నారు. అభ్యర్థుల వయస్సు 25 ఏళ్లలోపు వయస్సు కలిగి పదోతరగతి పరీక్షల్లో కనీసం 58 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.13500 స్టైఫండ్‌తోపాటు ఈఎస్ఐ, ఇతర సౌకర్యాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు బుధవారం తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, 2పాస్‌ఫోటోలతో డీఎల్‌టీసీ కేంద్రం వద్దకు బుధవారం ఉదయం 9 గంటలకు చేరుకోవాలన్నారు.

### నియామక పత్రాల అందజేత

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** కారుణ్య నియామకం పొందిన వారు అంకిత భావంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నలుగురికి కారుణ్య నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. జిల్లాలో సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు వివిధ అనారోగ్య కారణాలతో సర్వీసులో ఉంటూ మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు సచివాలయాల్లోని వివిధ శాఖల్లో కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు నలుగురికి అందజేశారు. జిల్లాలో వివిధ కార్యాలయాల్లో పనిచేస్తూ కోవిడ్‌తో మరణించిన వారి వివరాల నివేదికలు సత్వరం అందజేయాలని ఆదేశించారు.

### కవితలకు ఆహ్వానం

**ఆమదాలవలస:** ఆమదాలవలసకు చెందిన విశ్వసాహితి ఆధ్వర్యంలో 'కవితా సంకలనం' కోసం కవితలకు ఆహ్వానం పలుకుతున్నట్లు సంస్థ అధ్యక్షుడు పీవీ నరసింహులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కవితా సంకలనం కోసం పంపించే రచనలపై రచయిత పేరు, చిరునామా, ఫోన్ నంబర్ విధిగా రాయాలని సూచించారు. హామీ పత్రం తప్పనిసరిగా జతచేయాలని కోరారు. కవిత 25 లైన్లకు మించరాదన్నారు. ఆగస్టు 31లోగా కవితలు విశ్వసాహితికి చేరాలని తెలిపారు. 9490283743 నంబర్‌కు పంపాలన్నారు. హార్డ్ కాపీని కె.జనార్దనరావు, విశ్వసాహితీ కార్యదర్శి, సాహితీనగర్, బీఆర్‌నగర్, ఆమదాలవలస, శ్రీకాకుళంకు పంపాలని కోరారు.

### శ్రీకాకుళంలో జాబ్‌మేళా రేపు

**శ్రీకాకుళం న్యూకాలనీ:** జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన జాబ్‌మేళా జరగనుందని జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక దివ్య తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ రోడ్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రం కేంద్రం వేదికగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా మొదలవుతుందని తెలిపారు. మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలో 25 ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు, అలాగే 2050 హెల్త్ కేర్‌లో నర్సింగ్ అసిస్టెంట్లు 20, హోంకేర్ నర్స్ 20, క్రిటికల్ కేర్‌నర్స్ 20 పోస్టుల భర్తీ కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మణప్పు రం ఫైనాన్స్ కంపెనీలో ఎంపికైనవారు శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలి, పలాస, సోంపే ట, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. జీతం రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఉంటుందన్నారు. వయస్సు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. హెల్త్‌కేర్‌లో ఎంపికైనవారు వైజాగ్‌లో పనిచేయాల్సి ఉంటుందని, జీతం వివిధ పోస్టుల బట్టి రూ.9వేల నుంచి రూ.22వేల మధ్య ఉంటుందన్నారు. వయస్సు 19 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో హాజరుకావాలని కె.సుధ పేర్కొన్నారు. అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

### త్వరలో నిర్వాసితులకు అదనపు పరిహారం



గాజుల కొల్లివలస సచివాలయంలో నిర్వాసితుల అదనపు పరిహార లబ్ధిదారుల జాబితాలను ప్రచురిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**హిరమండలం:** అదనపు పరిహారం ఇంకా అందని వంశధార నిర్వాసితులకు త్వరలోనే అందిస్తామని తహసీల్దార్ బి.మురళీమోహన్ తెలిపారు. ఆయన తమ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మొత్తం నిర్వాసిత లబ్ధిదారులు 9251 మందికి గాను ఇప్పటివరకు 6,697 మందికి ప్రభుత్వం అందించిన అదనపు పరిహారం అందించామన్నారు. ఇంకా మిగిలిన 1572 మందితోపాటు నూతనంగా దరఖాస్తు చేసుకున్న 213 మందితో కలిపి 1785 మంది నిర్వాసితులకు అదనపు పరిహారం వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉందన్నారు. వీరి జాబితాలను ఆయా సచివాలయాల్లో సోమవారం ప్రచురించినట్లు తెలిపారు.

# బంగారు భవితకు నవోదయం



లాప్‌టాప్‌లో సాధన చేస్తున్న విద్యార్థులు

- ఆరో తరగతిలో ప్రవేశానికి ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల
- ఆగస్టు 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు అవకాశం
- జనవరి 20న జరగనున్న నవోదయ ప్రవేశ పరీక్ష




వెన్నెలవలసలోని జవహర్ నవోదయ విద్యాలయం

**శ్రీకాకుళం న్యూకాలనీ:** పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేసే నవోదయ విద్యా సంస్థ విద్యార్థులను పిలుస్తోంది. సరుబుజ్జిలి మండల పరిధిలోని వెన్నెలవలసలో సువిశాలమైన విస్తీర్ణంలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. ఆరు నుంచి ఇంటర్మీడియెట్ (+2)వరకు ఆంగ్ల మాధ్యమం ద్వారా ఉచిత విద్యను అందించే ఈ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ వెలువరించింది.

**10వ తేదీతో గడువు పూర్తి..**

నవోదయలో 6వ తరగతికి ప్రవేశాలకై ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. దరఖాస్తుల చేసుకునేందుకు ఆగస్టు 10వ తేదీతో గడువు ముగుస్తుంది. వచ్చే ఏడాది 2024 జనవరి 20న ఈ నవోదయ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వాసులైన 80 మంది ప్రతిభావంతులను ప్రతిభా పరీక్ష ద్వారా ఎంపిక చేసి, వారికి 6 నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌లో ఉచిత విద్యాబోధన, వసతి కల్పిస్తున్నారు.

**రిజర్వేషన్ విధానం..**

నవోదయలో ప్రవేశానికి రిజర్వేషన్ విధానం అమలవుతుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం సీట్లు కేటాయిస్తారు. షెడ్యూల్ కులాలకు 15 శాతం, షెడ్యూల్ తరగతులకు 7 శాతం, దివ్యాంగులకు 3 శాతం రిజర్వేషన్ కల్పిస్తారు. ప్రవేశాల్లో బాలికలకు 33 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తారు.

**నవోదయలో ప్రవేశం ఇలా..**

నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం ఈ విధంగా ఉంటుంది. ప్రవేశ పరీక్షకు ఒక విద్యార్థి ఒక్కసారి మాత్రమే హాజరయ్యే అవకాశం ఉంది. మొత్తం 80 సీట్లు ఉంటాయి. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. నవోదయ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు 2012 మే ఒకటో తేదీ నుంచి 2014 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3,4 తరగతులు ఉత్తీర్ణులై, ప్రస్తుతం 5వ తరగతి చదువుతుండాలి. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇతర పాఠశాలల్లో చదివే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లావాసులు మాత్రమే అర్హులు. వీరికి ప్రవేశ పరీక్షను వచ్చే ఏడాది జనవరి 20న నిర్వహిస్తారు. ఒకసారి ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంటర్ వరకు విద్యాభ్యాసం చేయవచ్చు. 9వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్లు ఏర్పడితే లేటరల్ విధానంలో ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు.

**అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే లక్ష్యంగా..**



నవోదయలో చదివే ప్రతి విద్యార్థిని అన్ని రంగాల్లో ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా విద్యాభ్యాసం కొనసాగుతుంది. విద్యాలయంలో 6 నుంచి ఇంటర్ వరకు సీబీఎస్ఈ సిలబస్‌తో ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తాం. విద్య, వసతి, ఇతర సౌకర్యాలు అన్నీ ఉచితం. ఎన్‌సీసీ, యోగా, డ్రిల్, క్రీడా శిక్షణ ఉన్నాయి. కొత్తగా జాతీయస్థాయిలో జరిగే జేఈఈ, నీట్ పరీక్షలకు సైతం విద్యార్థులను సన్నద్ధం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ దిశగా సాధన చేపిస్తున్నాం. ఈ నెల 10 వరకే దరఖాస్తులకు గడువు ఉంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– డి.పరశురామయ్య, ప్రిన్సిపాల్– జవహర్ నవోదయ విద్యాలయం, వెన్నెలవలస సరుబుజ్జిలి మండలం

# మున్సిపల్ కార్మికుల ధర్నా



ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్–ఎంప్లాయీస్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం, జిల్లా కోశాధికారి టి.సంతోష్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలని అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం శ్రీకాకుళం కలెక్టరేట్‌ను కార్మికులు ముట్టడించారు. ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస, శ్రీకాకుళం మున్సిపల్ కార్మికులు 9 గంటలకు శ్రీకాకుళం ఆర్ అండ్ బీ బంగ్లా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ప్రదర్శనగా వచ్చి గేటు వద్ద నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా పోలీసులకు, వారికి మధ్య పెనుగులాట జరిగింది. దీంతో పోలీసులు కొందరిని అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తులతో వారిని విడుదల చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆగస్టు 15వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయడానికి కూడా కార్మికులంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

# సిక్కోలు బ్రాండ్ నిలబెట్టాలి: కలెక్టర్



మగ్గంపై వడుకుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

**శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):** దేశంలో వ్యవసాయ రంగం తర్వాత అతి పెద్దది చేనేత రంగమని, అలాంటి రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. చేనేత జౌళి శాఖ, సిక్కోలు వీవర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో 9వ జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం సోమవా రం స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళగిరి, వెంకటగిరి మాదిరిగా పొందూరుకు బ్రాండ్ ఇమేజ్ ఉందని, అయితే దీన్ని మరింత విస్తరించాలని కోరారు. నేతన్న నేస్తం ద్వారా చేనేత కళాకారులకు న్యాయం జరుగుతోందన్నారు. చేనేతరంగ అభివృద్ధికి ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అందరం చేనేత వస్త్రాలు వినియోగించి చేనేతని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని అధికారులందరూ ప్రతి నెల మొదటి సోమవారం చేనేత వస్త్రాలను ధరించేలా జిల్లా యంత్రాంగం తరఫున ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు వారి నైపుణ్యాలు పెంచే దిశగా శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. తన తండ్రి కూడా చేనేత రంగంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారని, చేనేత రంగమే తమ కుటుంబాన్ని ఆదుకుందని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సంపతిరావు శ్రీదేవి మాట్లాడుతూ హైదరాబాద్ లో నిర్వహించనున్న గైనిక్ కాన్ఫరెన్స్‌లో శ్రీకాకుళం అందిస్తున్న చేనేత వస్త్రాల ప్రదర్శన ఏర్పాటు చేయించమని కోరగా జిల్లా కలెక్టర్ కావాల్సిన ఏర్పాట్లు చేయాలని ఏడీకి ఆదేశించారు. కలెక్టర్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి జిల్లా అధికారులకు, తదితరులకు తినిపించారు.

# 'చిరు ధాన్యాల సాగు పెంచుదాం'



చిరుధాన్యాల సాగు, వినియోగంపై మాట్లాడుతున్న డాక్టర్ సువర్ణ

**వజ్రపుకొత్తూరు:** రైతులు తమ పొలాల్లో చిరుధాన్యాల సాగును విరివిగా పెంచాలని డాక్టర్ సువర్ణ అన్నారు. పెద్దబొడ్డపాడు పంచాయతీలో సోమవారం జార్జి ఇన్‌స్టిట్యూట్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ అండ్ కేర్ రీసెర్చ్ (ఎన్ఐహెచ్ఆర్) ఆధ్వర్యంలో చిరు ధాన్యాల సాగు, వాడకంపై స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు. ముందుగా రైతులు పండించే పంటలు, తీసుకునే ఆహారంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల మధ్యాహ్న భోజన పథకంలో చిరుధాన్యాలను ఆహారంగా చేర్చేందుకు ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు ఆహారంగా తీసుకుంటే చేకూరే ప్రయోజనాలను రైతులకు, అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. స్థానిక సర్పంచ్ తమ్మినేని డిల్లీరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఐహెచ్ఆర్ వైద్యులు బాలాజీ, రేణుజాన్, ఆయుషి, షెహబ, సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగమ్మ, ఫీల్డ్ సూపర్‌వైజర్ తమ్మినేని దుర్యోధనరావు, పంచాయతీ కార్యదర్శి దామోదరం, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### సైరిగాంలో జ్వరాలు తగ్గుముఖం



సైరిగాంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

**జలుమూరు:** సైరిగాంలో జ్వరాలు తగ్గుముఖం పడుతున్నాయని ఆ పీహెచ్‌సీ మెడికల్ అధికారి పి.గురునాథరావు సోమవారం తెలిపారు. సైరిగాంతోపాటు లింగంన్నాయుడుపేటలో కూడా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నామని జ్వరం ఉన్నట్లు నిర్ధారణ జరిగితే పీహెచ్‌సీకి తరలించి అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు. జ్వరాలు తీవ్రంగా ఉంటే బుడితి సీహెచ్‌సీకి తరలిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు వైద్యులను, నంచి డాక్టర్లను ఆశ్రయించవద్దని సూచించారు. ఇప్పటికే పలు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లడం ద్వారా డెంగీ జ్వరాలు అంటూ రోగుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని వీటిని ప్రజలు గమనించాలన్నారు.

### ఆకట్టుకున్న ప్రదర్శన




కేజీబీవీలో నేషనల్ హ్యాండ్‌లూమ్ డే ఆకృతి

**మందస:** మందస మండలంలోని వీరగున్నమ్మపురం సమీపంలో గల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో నేషనల్ హ్యాండ్‌లూమ్‌డే సోమవారం ఘనంగా జరిగింది. చేనేత వస్త్రాలను నేషనల్ హేండ్‌లూమ్‌డే ఆకృతిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రఘుపాత్రుని వాసంతి మాట్లాడుతూ చేనేత వస్త్రాల ఆ వశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు బి.భాగ్యలక్ష్మి, ఎస్.మీనా, పి.భవాని, ఎం.ఇంద్రావతి, ఎస్.లావణ్య, ఎల్.లలిత, ఎస్.భాగ్యలక్ష్మి, పి.పావని, బి.అశ్విని, జి.సంతోషి, సిబ్బంది ఉన్నారు.

### 'అవాంఛనీయ సంఘటనలు జరగకూడదు'



కొత్తూరులోని నాలుగు రోడ్లు కూడలిని పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

**కొత్తూరు:** కొత్తూరులో ఈ నెల 10న చంద్రబాబు పర్యటించనున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని స్థానిక పోలీస్ అధికారులకు ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశించారు. కొత్తూరులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద చంద్రబాబు నాయుడు రోడ్ షో ఉన్నందున నాలుగు రోడ్ల కూడలిని ఆమె పరిశీలించారు. పాత భవనాల శ్లాబుల పైకి ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ, డీఎస్పీ బాలచంద్రా రెడ్డి, సీఐ ఆర్.వేణుగోపాలరావు, కొత్తూరు, హిరమండలం ఎస్ఐలు ఎం.గోవింద, నారాయణ స్వాములు ఉన్నారు.

# ఏపీఎల్-2లో సిక్కోలు యువకులు

- వివిధ ప్రాంఛైజీలకు 8 మంది క్రీడాకారుల ఎంపిక
- 16 నుంచి మొదలుకానున్న మెగా టోర్నీ



దుప్పల కులశేఖర్



మన్యాల ప్రణీత్



బైనపల్లి రోహిత్



బైనపల్లి రోహిత్



ఎస్‌హెచ్ శ్రీనివాస్



నిమ్మల హిమకర్



బెందాళం సాత్విక్



త్రిపురాన విజయ్

**శ్రీకాకుళం న్యూకాలనీ:** ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2లో సిక్కోలు కుర్రాళ్లకు అవకాశం లభించింది. జిల్లా నుంచి రికార్డు స్థాయిలో 8 మంది క్రికెటర్లను వివిధ ప్రాంఛైజీలు వేలం పాటలో దక్కించుకున్నాయి. ఇటీవలి కాలంలో ఏసీఏ నిర్వహిస్తున్న వివిధ టోర్నీల్లో మెరుగైన ఆటతీరుతో రాణించిన క్రీడాకారులను వేలంలో దక్కించుకున్నాయి. దీంతో కొంతమంది క్రీడాకారులు జాక్‌పాట్ కొట్టారు. మరికొంతమంది కనీస ధరకు అమ్ముడుపోయారు.

● ఎస్‌హెచ్ శ్రీనివాస్‌ను ఉత్తరాంధ్ర లయన్స్ రూ.4.40లక్షలకు కొనుగోలు చేసింది. ● నిమ్మల హిమకర్–గోదావరి టైటాన్స్ రూ.3.40లక్షలకు, ● బెందాళం సాత్విక్–గోదావరి టైటాన్స్ రూ.90వేలకు, ● త్రిపురాన విజయ్–గోదావరి టైటాన్స్ రూ.90వేలు, ● దుప్పల కులశేఖర్–వైజాగ్ వారియర్స్ రూ.76వేలకు, ● మన్యాల ప్రణీత్– కోస్టల్ రైడర్స్ రూ.55వేలకు, ● బైనపల్లి రోహిత్– ఉత్తరాంధ్ర లయన్స్ రూ.25వేలకు, ● డీవీఎస్ శ్రీరామ్‌ను ఉత్తరాంధ్ర లయన్స్ రూ.25వేల కనిష్ట ధరకు కొనుగులు చేసింది.

**జిల్లాకు గర్వ కారణం**

జిల్లా నుంచి రికార్డుస్థాయిలో 8 మంది క్రీడాకారులు ఏపీఎల్–2లో అవకాశం దక్కించుకోవడం గర్వకారణమని జిల్లా క్రికెట్ సంఘం పేర్కొంది. టోర్నీలో అత్యుత్తమ ఆటతీరుతో రాణించి ఐపీఎల్‌కు ఎంపిక కావాలని జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ఎన్ శాస్త్రి, కార్యదర్శి హసన్‌రాజ్ షేక్, మదీనా శైలానీ, కౌన్సిలర్ సువ్వారి రవికుమార్, ఇలియాస్ మహ్మద్, చీఫ్ కోచ్ కిల్లిసుదర్శన్, క్రికెట్ సంఘ ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు ఆకాంక్షించారు.

# 10న డీ వార్మింగ్ డే



డీ వార్మింగ్ సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ మురళీకృష్ణ

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన మాత్రలు పక్కాగా వేయించాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ వైద్యాధికారులను కోరారు. ఈ మాత్రలు తీసుకోవడం వల్ల ఎలాంటి దుష్ప్రభావాలు ఉండవని వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాలు భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలో ఈ నెల 10న డీ–వార్మింగ్ డే, 17న మాప్ అప్ డే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం డీఆర్‌ఓ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి రెండేళ్ల వరకు పిల్లలకు సగం మాత్ర, 3 నుంచి 19 ఏళ్ల వరకు గల విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లని పిల్లలకు అంగన్‌వాడీ కార్యకర్తలు ద్వారా మాత్రలు వేయించాలన్నారు. ప్రతి పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత ప్రతి విద్యార్థికి ఒక మాత్రను వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో నమిలి తినిపించాలని పేర్కొన్నారు. అలాగే చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలకు మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా సమన్వయకర్త డాక్టర్ సి.పి.శ్రీదేవి, జిల్లా మాస్ మీడియాధికారి పైడి వెంకటరమణ, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణ అధికారి ఆర్.వెంకట రామన్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డీవీ విద్యాసాగర్, పట్టణ ఆరోగ్య అధికారి డాక్టర్ జి.వెంకటరావు, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఇంటర్మీడియట్ బోర్డ్) ఎస్.తవిటి నాయుడు, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కె.ప్రకాశరావు, ప్రోగ్రాం మేనేజర్ అప్పలనాయుడు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉపకరణాల అందజేతకు శిబిరాలు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అలిమ్‌కో సంస్థ హైదరాబాద్ వారి సహకారంతో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ కవిత ఓ ప్రకటనలో తెలిపారు. శారీరక వైకల్యం ఉన్న వారికి మూడు చక్రాల కుర్చీలు అందజేస్తారని పేర్కొన్నారు. అలాగే రెండు చక్రాల తోపుడు కుర్చీ, చేతి కర్రలు, చూపు లేని వారికి రొటేటర్, బధిరులకు ప్లేయర్లు అందజేస్తారని తెలిపారు. అలాగే వినికిడి యంత్రాలు, కృత్రిమ దందాలు, కళ్లద్దాల వంటివి కూడా అర్హతను బట్టి అందజేస్తారని వివరించారు.

- 8వ తేదీన శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియంలో గార, శ్రీకాకుళం, నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పోలాకి మండలాల వారికి శిబిరం నిర్వహిస్తారు.
- 9వ తేదీన ఆమదాలవలస ఏఎంసీ యార్డులో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాలకు..
- 10న పాతపట్నం ఏఎంసీ యార్డులో పాతపట్నం, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట, కొత్తూరు, హిరమండలం టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు..
- 11న పలాస మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, పలాస, మందస, వజ్రపు కొత్తూరు మండలాల వారికి ఎంపికలు ఉంటాయని తెలిపారు.
- మెడికల్ ధ్రువీకరణ పత్రం కనీసం 40 శాతం ఉండాలని సూచించారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, లేదా ఓటర్ కార్డు, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు (అంగ వైకల్యము కనిపించే విధంగా ఉన్నవి), ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. గత మూడేళ్లలో ఈ ఉపకరణాలు తీసుకున్న వారిని అనర్హులుగా గుర్తిస్తామన్నారు.


### చిన్నారి.. చేనేత వస్త్రధారి

**నందిగాం:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దతామరాపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు చేనేత వస్త్రాలు ధరించి ఫ్యాషన్ షో నిర్వహించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో నేతన్న నేస్తం లబ్ధిదారుల వద్దకు వెళ్లి చేనేత వస్త్రాల తయారీ కోసం తెలుసుకున్నారు.



పెద్దతామరాపల్లిలో చేనేత వస్త్రాలు ధరించిన విద్యార్థులు

## • విప్లవ వాగ్గేయకారుడికి సైకత నివాళి




తన పాటలతో ఉద్యమాలను నడిపిన వాగ్గేయకారుడికి సైకత శిల్పి హరికృష్ణ తన శైలిలో నివాళులర్పించారు. గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద ఇసుకతో గద్దర్ చిత్రాన్ని తయారుచేసి జోహార్ గద్దర్ అంటూ సంతాపం తెలిపారు. – ఆమదాలవలస రూరల్